సాక్షి వనపర్తి

ఆదివారం । 10 । నవంబర్ । 2024



భక్తితో ప్రణమిల్లి..

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చి దర్శించుకుంటున్నారు.

వివరాలు 8లో ▸



సత్తాచాటిన బాలికలు

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య పాలమూరు బాలికలు సత్తా చాటారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.4 /19.7

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఓటరు జాబితా ప్రదర్శించాలి : కలెక్టర్


వనపర్తి: జిల్లాలోని ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఓటరు జాబితా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి బీఎల్‌ఓలను ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం -2025లో భాగంగా శనివారం జిల్లాకేంద్రం లోని **మర్రికుంట, బండారునగర్, ఇందిరాన** గర్‌లో**ని పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మి** కంగా **తనిఖీ చేశారు. డబుల్ ఓట్లు ఉన్నట్ల** యితే **ఫారం–7 ద్వారా వెంటనే తొలగించాల** ని, సవరణలు ఉంటే ఫారం–8 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2025, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ రమేశ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, బీఎల్‌ఓలు ఉన్నారు.

‘పాలమూరు–రంగారెడ్డి’ని రెండుగా విభజించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి పీఏవీ బహిరంగ లేఖ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రెండుగా విభజించాలని పాలమూరు అధ్యయన వేదిక (పీఏవీ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రొ.జి.హరగోపాల్, కన్వీనర్ ఎం.రాఘవాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. జూరాల ఎగువ ప్రాంతం నుంచి సగం, ప్రస్తుత పథకం నుంచి సగం నీరు తీసుకునేలా చేపట్టాలన్నారు. ఆర్డీఎస్‌ను ఆధునీకీకరించాలని, చంద్రసాగర్ నుంచి అమ్రాబాద్ ఎత్తిపోతలను, షాద్‌నగర్‌లో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలన్నారు. రాష్ట్రంలో ఇథనాల్ కంపెనీల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, పాలెం, కొడంగల్‌లో ఓరియంటల్ కాలేజీలను ప్రభుత్వ నిర్వహణలో పునఃప్రారంభించాలన్నారు. వీటిని తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలో ఉంచాలన్నారు. తెలుగు భాషా వికాసానికి ఆదర్శవంతమైన విధానం రూపొందించాలని అందులో పేర్కొన్నారు.

జానపద కళారంగంలో నూతన ఒరవడి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జానపద కళారంగంలో సంచలనం సృష్టిస్తున్న నూరేళ్ల నా ఊరు గేయకావ్యం కళాకారులందరిలో నూతనోత్తేజం తెస్తుంది.. జిల్లా జిల్లాలో కళాకారులు చూపుతున్న ఆదరణ సంతోషాన్ని కలిగిస్తుంది.. కళాకారులు ఇదే విధంగా ఐక్యతగా ఉంటూ కళలను ఆదరిస్తూ.. కళాకారులను గౌరవిస్తే కళారంగానికి ఎంతో బలం చేకూరుతుందని కవి, గాయకులు, సినీ సంగీత దర్శకులు వరంగల్ శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో శనివారం జరిగిన నూరేళ్ల నా ఊరు గేయ కావ్యానికి గాయకుల ఎంపిక నిర్వహించగా సుమారు 140 మంది దాకా హాజరయ్యారు. ఈ సందర్భంగా వందేళ్లకు పూర్వం సహజమైన పల్లె జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కళ్లకు కట్టినట్టుగా రచించి.. రాబోయే తరాలకు ఈ విలువైన చరిత్రను అందించాలనే ఉద్దేశంతో 243 చరణాల గేయకావ్యాన్ని 243 మంది మట్టిలో మాణిక్యాలాంటి గొంతులను ఏరి పాడించి.. జానపద కళారంగంలో నూతన ఒరవడి సృష్టించేందుకు వినూత్నమైన ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. మొదటిసారి మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చిన వరంగల్ శ్రీనివాస్‌ను కళాకారులు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పాలమూరు జానపద కళాకారుడు జంగిరెడ్డి పెద్ద కుమార్తె స్ఫూర్తికి సభలో మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవిశంకర్, జయప్రకాష్, జక్క గోపాల్, రేలారే ప్రసాద్, దప్పు స్వామి, గోల్కొండ బుచ్చన్న, జూపాక శివ, గూడూరి మహేష్, కేశవులు, పరశురాం, టంకర శ్రీనివాస్, నర్సింహ, సంతోష, సువర్ణ, శైలజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కూలీ పనులకు వెళ్తూ.. అనంతలోకాలకు

ట్రాక్టర్ బోల్తా : ఇద్దరు కూలీల దుర్మరణం

- మరో 18 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- వనపర్తి మండలం సవాయిగూడెంలో ఘటన

వివరాలు 8లో..

ఆగమాగం.. గందరగోళం!

జిల్లాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణన సర్వే షురూ



మదనాపురం మండలం దుప్పల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్, అధికారులు

- తొలిరోజు ఇంటింటికీ తిరుగుతూ వివరాల సేకరించిన ఎన్యూమరేటర్లు
- ఒక్కో ఇంటికి 35 నిమిషాల నుంచి గంట వరకు సమయం..
- గ్రామాల్లో పొలాల వద్దకు రైతులు.. అధిక సంఖ్యలో ఇళ్లకు తాళాలు
- పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు ప్రజల విముఖత
- అసిస్టెంట్లు కావాలని ఎన్యూమరేటర్ల విజ్ఞప్తులు

జిల్లాల వారీగా సర్వే ఇలా..

జిల్లా	కుటుంబాలు	ఎన్యూమరేటర్లు
మహబూబ్‌నగర్	2,62,585	1,880
నారాయణపేట	1,55,999	1,201
నాగర్‌కర్నూల్	2,20,673	1,979
వనపర్తి	1,70,000	1,392
జో.గద్వాల	1,58,614	1,117
మొత్తం	9,67,871	7,569

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/వనపర్తి : ఉమ్మడి జిల్లాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వే ప్రారంభమైంది. తొలి రోజు పల్లెల్లో ఉదయం, పట్టణంలో మధ్యాహ్నం ఎన్యూమరేటర్లు ఇంటింటి బాట పట్టారు. కుటుంబాల వారీగా వివరాలు సేకరించారు. అయితే.. సర్వేకు ఒక్కో ఇంటికి 35 నిమిషాల నుంచి గంట వరకు సమయం పట్టింది. కొన్నిచోట్ల పూర్తి వివరాలు చెప్పేందుకు ప్రజలు ఆసక్తి చూపకపోవడం.. ఆస్తులు చెబితే రేషన్‌కార్డు, సంక్షేమ పథకాలు తొలగిస్తారా.. మీకెందుకు? అని ప్రశ్నిస్తుండడం.. గ్రామాల్లో వ్యవసాయ పనులకు వెళ్లడంతో చాలా ఇళ్లకు తాళాలు వేసి ఉండడం ఎన్యూమరేటర్లకు ఇబ్బందిగా మారింది. అంతేకాదు.. కేటగిరీల వారీగా బుక్‌లెట్ చూసుకుంటూ సర్వే ఫాం నింపడం ఎన్యూమరేటర్‌కు కష్టతరం కాగా.. గందరగోళానికి గురయ్యారు. ఈ క్రమంలో సహాయకులను ఇవ్వాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. వనపర్తి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తొలిరోజు ప్రజలు వ్యక్తిగత సమాచారం ఇచ్చేందుకు విముఖత చూపారు. పట్టణాల్లో కొంతమేర వివరాల సేకరణ సులభంగా ఉన్నా.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఎన్యూమరేటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. ఆస్తులు, అప్పులు, రాజకీయ నేపథ్యం లాంటి వివరాలు ఎందుకు చెప్పాలంటూ ప్రశ్నిస్తున్నారు. అన్ని వివరాలు సేకరించేందుకు సమయం పడుతుండటంతో రోజుకు ఆరు నుంచి ఎనిమిది కుటుంబాలకు మించి సర్వే చేయడం సాధ్యం కాదని ఎన్యూమరేటర్లు చెబుతున్నారు.

సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్..



జిల్లాకేంద్రంలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

శనివారం జిల్లాకేంద్రంలోని ఇందిరాకాలని, రాంనగర్ కాలనీల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలో 170 బ్లాక్‌లు ఏర్పాటు చేశామని, వివరాల నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

డిప్యూటీ సీఎం, సీఎస్ వీడియో కాన్ఫరెన్స్..

సర్వే ప్రారంభానికి ముందే ఉదయం 8 గంటలకే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీఎస్ శాంతకుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. వివరాల వెల్లడితో ప్రజలు ఎలాంటి అనుమానాలకు తావివ్వొద్దని అధికారులు, సిబ్బంది సూచనలు చేయాలని చెప్పామన్నారు. ఎన్యూమరేటర్లకు ఎలాంటి అనుమానాలున్నా సూపర్‌వైజర్లతో నివృత్తి చేసుకోవాలని చెప్పామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, సీపీఓ భూపాల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి..

“వివరాల సేకరణకు సమయం పడుతుంది. కొన్నిచోట్ల ప్రజలు ఎన్యూమరేటర్లకు వివరాలు చెప్పడానికి విముఖత చూపిస్తున్నారు. పదిరోజుల వ్యవధిలో ఒక్కో ఎన్యూమరేటర్ చేయాల్సిన 150 కుటుంబాల వివరాలు సేకరించకుంటే ప్రభుత్వం గడువు పొడిగించవచ్చు. తొలిరోజు అక్కడక్కడ ఇబ్బందులు ఎదురైనా ప్రశాంతంగానే సర్వే ముగించాం. – భూపాల్‌రెడ్డి, సీపీఓ, వనపర్తి

తొలిరోజు తలెత్తిన సమస్యలు ఇవే..

- సర్వేలో ఇచ్చిన బుక్‌లెట్ ఆధారంగా ఫాం నింపాల్సి వస్తోంది. కేటగిరీల వారీగా బుక్‌లెట్ చూసుకుంటూ నింపడానికి ఇబ్బంది పడుతున్నారు. అసిస్టెంట్లు కావాలని అడుగుతున్నారు. కొందరు టీచర్లు భార్యలను సహాయంగా తెచ్చుకున్నారు. కొంతమంది మహిళా టీచర్లు భర్తలు, పిల్లలను సహాయకులుగా వెంట తెచ్చుకున్నారు.
- 19వ కాలంలో చేస్తున్న కులవృత్తి చెప్పడానికి వెనుకాడుతున్నారు. కుల వృత్తి చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.
- 52వ కాలంలో చరాస్తులు అంటే టీవీ, రిఫ్రిజిరేటర్, స్మార్ట్‌ఫోన్, బైక్, కార్, వాషింగ్ మిషన్ వంటి వాటి గురించి అడిగారు. వీటిని అప్పు మీద, సెకండ్ హ్యాండ్‌లో కొనుగోలు చేసి ఉంటాం.. అవి ఎందుకు అంటూ ఎదురుప్రశ్నలు వస్తున్నాయి.
- 51వ కాలంలో స్థిరాస్తులు అడిగారు. ఆస్తి వివరాలు చెప్పడానికి చాలామంది వెనుకంజ వేస్తున్నారు.
- దేవరకద్ర నియోజకవర్గంలో చాలామంది గొల్ల కురుమలు బీసీలుగా ఉన్నారు. సర్వే సందర్భంగా కులాల జాబితాలో వారు మాదాసి కురువలుగా రాయించుకున్నట్లు తెలిసింది. ఇలాగైతే వారు ఎస్సీ కేటగిరీ కిందకు వచ్చే అవకాశం ఉంది.
- అలాగే రుణాల విషయంలో చెప్పడానికి ఇష్టపడడం లేదు. మాకు ఉన్న లోన్ మీరు తీరుస్తారా.. ఎందుకు చెప్పాలంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు.
- క్రిస్టియన్ల విషయంలో కొంత వ్యతిరేకత వస్తోంది. క్రిస్టియన్లను బీసీ–సీగా పరిగణించాల్సి ఉంది. అయితే చాలామంది తమను ఎస్సీలుగానే చెప్పుకుంటున్నారు. వారి వద్ద ఎస్సీ సర్టిఫికెట్లు చూపిస్తున్నారు. వారిని ఏ కేటగిరీలో తీసుకోవాలో తెలియక ఎన్యూమరేటర్లు గందరగోళానికి గురయ్యారు.
- క్రిస్టియన్ మతం స్వీకరించిన వారు బీసీలుగా కాకుండా ఎస్సీలుగా చెప్పుకుంటున్నట్లు పలువురు ఎన్యూమరేటర్లు చెబుతున్నారు.
- గ్రామాల్లో చాలా ఇళ్లు తాళం వేసి ఉన్నాయి. ఒకవేళ ఇంట్లో పెద్దలు ఉన్నా ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం లభించడం లేదు. లోన్లు, ఆధార్ కార్డులు, ధరణి పాసుబుక్కులపై సరైన సమాచారం ఇవ్వకుండా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.
- ముస్లింలలో కొన్ని వర్గాలను బీసీ–ఈలో చూపించడానికి లేదు. వారిని ఎక్కడ చూపించాలో కాలం లేదు.
- రుణాల విషయంలోనూ వ్యతిరేకత వస్తోంది. ఇన్‌కంటాక్స్ కట్టేవాళ్లు సైతం చెప్పటానికి ఇష్టపడడం లేదు. రుణాలు ఉంటే ప్రభుత్వం ఏమైనా తీరుస్తుందా అంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు.
- ఒక్క ఇంటి వద్ద కనీసం 35 నిమిషాల నుంచి గంట వరకు టైం పడుతోంది. మొదటి రోజు కావడంతో ఒక్కొకరు ఐదు, ఆరు ఇళ్లు, పూర్తి చేయగా.. కొందరు ఎనిమిది నుంచి పది ఇళ్ల వరకు సర్వే నిర్వహించారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక

కురుమూర్తిలో ఘాట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



చిన్నచింతకుంట: మహబుబ్‌నగర్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం రానున్నారు. ఈ మేరకు కురుమూర్తిస్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోనున్నారు. అనంతరం ఆలయం వద్ద రూ.110 కోట్లతో నిర్మించనున్న ఘాట్ రోడ్డుకు భూమిపూజ చేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు శనివారం ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అమ్మాపురం గ్రామ సమీపంలో హెలీప్యాడ్ సిద్ధం చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద స్టేజీ ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పనులను శనివారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు.



కురుమూర్తిస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే

భక్తులకు ఇబ్బందులు కలిగించం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సీఎం వస్తున్నందున స్వామివారి దర్శనానికి భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అపోహలు వస్తున్నాయని, వీటిని నమ్మవద్దన్నారు. భక్తులకు స్వామివారి దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పర్యటన వివరాలు ఇలా..

సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గాన కురుమూర్తి స్వామి ఆలయానికి రానున్నారు. హైదరాబాద్–కర్నూలు హైవేపై కొత్తకోట మీదుగా కురుమూర్తికి చేరుకోనున్నారు.

- ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని సీఎం నివాసం నుంచి కాన్వాయ్ బయలుదేరుతుంది.
- మధ్యాహ్నం 12 గంటలకు కురుమూర్తి ఆలయానికి చేరుకుంటారు.
- 12.10 నుంచి 12.30 వరకు ఆలయం వద్ద ఘాట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తారు.
- 12.30 నుంచి ఒంటి గంట వరకు స్వామివారిని దర్శించుకుంటారు.
- ఒంటి గంటకు తిరిగి రోడ్డు మార్గంలోనే హైదరాబాద్ వెళ్లిపోతారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: క్రీడాకారులు జాతి గర్వించే స్థాయికి ఎదిగేలా క్రీడల్లో రాణించాలని, దేశం, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌ను క్రికెట్ మైదానంగా తీర్చిదిద్ది శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. వనపర్తి అభి క్రికెట్ అకాడమీ, మహబూబ్‌నగర్ పెవిలియన్ క్రికెట్ క్లబ్ అకాడమీ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడాయి. వనపర్తి అభి క్రికెట్ అకాడమీ జట్టు విజయం సాధించగా.. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడారు. జిల్లాకేంద్రంలో క్రికెట్ ఆడేందుకు అనుకూలంగా పరేడ్ మైదానాన్ని తీర్చిదిద్దినట్లు వివరించారు. క్రీడాకారులు స్నేహభావంతో కలిసి మెలిసి ఉంటూ తమ జట్టు గెలుపునకు కృషి చేయాలని, జాతీయస్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రవిపాల్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ శివకుమార్, అభి స్పోర్ట్స్ క్రికెట్ కోచ్ శ్రీరాంబాబు, మహబూబ్‌నగర్ పెవిలియన్ క్రికెట్ క్లబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

లాంచీ ప్రయాణ ఏర్పాట్ల పరిశీలన



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణానదిలో రెండోసారి లాంచీ ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లను శనివారం రాష్ట్ర పర్యాటక శాఖ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సైదులు పరిశీలించారు. ఈ సందర్భంగా లాంచీ ఫిట్‌నెస్ తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణానది బ్యాక్ వాటర్‌లో 6 గంటలపాటు లాంచీ ప్రయాణం ఉంటుందన్నారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి నర్సింహ, కొల్లాపూర్ రేంజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు


బిజినేపల్లి: నందివడ్డెమాన్ శనేశ్వరుడిని శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకొని శనిదోష నివారణ పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తులతో తిలతైలాభిషేకాలు, అర్చనలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు శాంతికుమార్, ఉమామహేశ్వర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



‘చంద్రగఢ్’ దశ మారేనా?

ఉమ్మడి ఎత్తిపోతల ఆయకట్టు 15 వేల ఎకరాలు

- మరమ్మతుకు రూ.7.50 కోట్ల ప్రతిపాదనలు
- చంద్రగఢ్, నాగిరెడ్డిపల్లి, బెక్కర్‌పల్లిగా విభజన
- ప్యానల్ బోర్డులు కాలినా పట్టించుకోని అధికారులు
- నీటిపారుదలశాఖ మంత్రికి విన్నవించినా మంజూరుకాని నిధులు



చంద్రగఢ్ ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్.. ఇన్‌సెట్‌లో కాలిపోయిన ప్యానల్ బోర్డులు

అమరచింత: నియోజకవర్గంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన చంద్రగఢ్ మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారింది. రెండేళ్లుగా మరమ్మతుల కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతోనే సరిపోతుందే తప్పా నిధులు మంజూరు కావడం లేదు. గతేడాది నాగిరెడ్డిపల్లి, బెక్కర్‌పల్లి ఎత్తిపోతల పథకాల ప్యానల్ బోర్డులు కాలిపోవడంతో మోటార్లు పనిచేయక వృథాగా మారాయి. దీంతోపాటు చంద్రగఢ్ ఎత్తిపోతల పథకం ప్యానల్‌బోర్డు సైతం గత నెలలో కాలిపోయింది. మూడు లిఫ్టుల మరమ్మతుల కోసం సుమారు రూ.7.50 కోట్లు అవసరమని అధికారులు నీటిపారుదలశాఖ మంత్రి, ఎమ్మెల్యేకు విన్నవించారు. అయినా నిధుల మంజూరుపై నేటికీ స్పష్టత రాకపోవడంతో ఆయా పథకాల నిర్వహణపై నీలినీడలు అలుముకున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి ఆయా పథకాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జూరాల జలాశయం నిల్వనీటి ఆధారంగా చంద్రగఢ్ ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు. చంద్రగఢ్ ద్వారా ఆశించిన మేర ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేమని భావించిన అప్పటి ప్రజాప్రతినిధులు చంద్రగఢ్, బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాలుగా నామకరణం చేసి వీటి నిర్మాణానికి 2005లో రూ.50 కోట్లు మంజూరు చేశారు. ఒక్కో ఎత్తిపోతల కింద 5 వేల ఎకరాల ఆయకట్టు నిర్దేశించి ఆయా గ్రామాల రైతులకు సాగునీరు అందించేందుకు శ్రీకారం చుట్టారు. కాని పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మాణం చేసి నిర్వహణ బాధ్యతలను రైతులకు అప్పగించారు. పైపులు నాణ్యతగా లేకపోవడంతో ఎక్కడికక్కడ పగిలి నిర్వహణ పూర్తిగా గాడితప్పింది. పైపులు మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని గత ప్రభుత్వ హయంలో పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. ప్రధాన సంపుహౌజ్ నుంచి ఒక్కో ఫేజ్‌కు నీరందించే ప్రధాన పైపులు మారిస్తే ఆశించిన ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. ఈ మూడు పథకాలు మూతబడటంతో రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు.

- నాగిరెడ్డి ఎత్తిపోతల పథకం ప్రధాన గ్రావిటీ పైప్‌లైన్ తుప్పపట్టి రంధ్రాలు పడ్డాయి. దీంతో నీరంతా వృథా అయిన సందర్భాలున్నాయి. బెక్కర్‌పల్లి ఎత్తిపోతల పథకం నుంచి పొలాలకు నీరందించే పిల్ల కాల్వలను పూడికతీసి కొత్తవి ఏర్పాటు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. అమరచింత సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్తంభాలను మార్చాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని తెలిపారు. నిధులు లేక నీళ్లరాక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతుల ప్రతిపాదనలు ఇలా...

ఎత్తిపోతల పథకం	అంచనా వ్యయం (రూ.కోట్లలో..)
చంద్రగఢ్	2.16
బెక్కర్‌పల్లి	2.24
నాగిరెడ్డిపల్లి	2.84


మోటార్లు పనిచేయడం లేదు..

చంద్రగఢ్ ప్రధాన పంప్‌హౌజ్‌లోని నాగిరెడ్డిపల్లి, బెక్కర్‌పల్లి, చంద్రగఢ్ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన ప్యానల్ బోర్డులు కాలిపోయాయి. దీంతో లిఫ్ట్ మోటార్లు పని చేయడం లేదు. ఈ విషయాన్ని ఆయా ఎత్తిపోతల కమిటీలకు విన్నవించాం. వారితో పాటు అధికారులు వచ్చి కాలిన ప్యానెల్ బోర్డులను పరిశీలించారు.
– చుక్కా నారాయణరెడ్డి, ఆపరేటర్

ప్రభుత్వం దృష్టి సారించాలి..

చంద్రగఢ్‌కు అనుసంధానంగా ఉన్న బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాల నిర్వహణ కొన్నేళ్లుగా మరుగునపడింది. వీటికి సంబంధించిన ప్యానల్ బోర్డులు కాలిపోయాయి. ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల నిర్వహణపై దృష్టి సారించి నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలి. – సర్వారెడ్డి, అధ్యక్షుడు, చంద్రగఢ్ ఎత్తిపోతల పథకం

త్వరలోనే మరమ్మతులు..



చంద్రగఢ్, బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాల ఆధునీకీకరణకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నీటిపారుదలశాఖ మంత్రి ఆదేశాల మేరకు రూ.7.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నిధులు మంజూరు కాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరమ్మతులు చేపడతాం. లిఫ్టుల లోపాలను పూర్తిస్థాయిలో సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– జగన్మోహన్, ఈఈ, జూరాల ఎడమకాల్వ విభాగం


క్యూలైన్‌లో పోటెత్తిన భక్తులు


కురుమూర్తిస్వామిని దర్శించుకుంటూ..


జాతర మైదానంలో కోలాహలం..


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భక్తితో ప్రణమిల్లి..

- కురుమూర్తికి పోటెత్తిన భక్తజనం
- కిటకిటలాడిన జాతర మైదానం
- మారుమోగిన గోవిందనామస్మరణ

చిన్నచింతకుంట: తమ ఇంటి ఇలవేల్పుగా వెలుగొందుతున్న కురుమూర్తిస్వామిని పాలమూరు మట్టిబిడ్డలు భక్తితో ప్రణమిల్లుతున్నారు. శనివారం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ముందుగా పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి.. తడి వస్త్రాలతో స్వామివారి దర్శనానికి బారులుదీరారు. కొండ దిగువన జాతర మైదానంలో మట్టికుండల్లో అన్నం వండి.. పచ్చిపులుసుతో దాసంగాలు పెట్టారు. తలనీలాలు సమర్పించి.. గండదీపాలు మోశారు. గుమ్మడి కాయలు, బంతిపూలు, కుంకుమ, కర్పూర హారతులతో మెట్లపై కొబ్బరికాయలు కొట్టి.. మొక్కులు తీర్చుకున్నారు. ఉదయాన్నే సిబ్బంది ఆలయాన్ని శుద్ధి చేసి భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ఆలయానికి చేరుకుని ఉదయం నుంచే క్యూలైన్‌లో బారులుదీరారు. కొండ దిగువన దాసంగాలు పెట్టి తమ పిల్లాపాపలను చల్లగా చూడాలని వేడుకున్నారు. అలాగే కొండపైన అలివేలు మంగమ్మ, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపం, చెన్నకేశవస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. కొండ దిగువన వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి.


కిటకిటలాడుతున్న కోనేరు


స్వామివారి ఉద్దాలను దర్శించుకుంటున్న భక్తులు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఉరివేసుకుని మృతిచెందిన సంఘటన మండలంలోని మంతటి గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. లింగాల మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన జగదీశ్(22) కల్వకుర్తిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతను కళాశాలకు బిజినేపల్లి మండలంలోని బోయాపూర్‌లో తన అక్క ఇంటి వద్ద నుంచి కళాశాలకు వెళ్తుండేవాడు. శనివారం కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి మంతటి గ్రామ శివారులోని కేఎల్‌ఐ కాల్వ వద్ద చెట్టుకు అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి జగదీశ్ తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

రాజాపూర్(బాలానగర్): రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందిన ఘటన బాలానగర్ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ వివరాల మేరకు.. రాజోళి మండలం మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన అల్లావలీ (30) వృత్తిరీత్యా లారీ డ్రైవర్. అతడు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ నుంచి లారీలో పాట్లు లోడ్‌తో హైదరాబాద్‌వైపు వెళ్తూ.. బాలానగర్‌లో టీ తాగేందుకు ఆగాడు. రోడ్డు అవతలి వైపున టీ తాగి, లారీ వద్దకు వస్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

తప్పిదాలకు తావివ్వొద్దు


జోగుళాంబ ఆలయ పాలకమండలి సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న సభ్యులు

- పరిపాలనా పరమైన అంశాల్లో రాజీ పడం
- జోగుళాంబ ఆలయ పాలకమండలి స్పష్టం
- తొలి సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు

జోగుళాంబ శక్తిపీఠం: భక్తుల నమ్మకం, ఆలయ పవిత్రత విషయాల్లో ఎటువంటి తప్పిదాలు ఉండరాదని.. ఆలయాభివృద్ధి, పరిపాలనా పరమైన అంశాల్లో రాజీ పడమని జోగుళాంబ ఆలయ పాలక మండలి స్పష్టం చేసింది. అలంపూర్ క్షేత్రంలో శనివారం చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి అధ్యక్షతన పాలకమండలి తొలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. 12న హైదరాబాద్‌లో జరిగే కోటి దీపోత్సవంలో జోగుళాంబ కల్యాణం ఉంటుందని.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యే అవకాశం ఉందన్నారు. కల్యాణ వేడుకకు సభ్యులందరూ హాజరు కావాలని తీర్మానం చేశారు. బాలబ్రహ్మేశ్వరుడి నిజరూప దర్శన భాగ్యంతో పాటు కేటాయించిన సమయంలో అభిషేకాలకు పత్యేక టికెట్లను పరిమిత సంఖ్యలో ఇవ్వాలని తీర్మానించారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న పాపనాశ్వర తదితర ఆలయాల్లో ఎవరి విధులు వారే నిర్వర్తించాలని, వారి స్థానంలో ఇతరులు పనిచేయరాదని తీర్మానం చేశారు. భక్తుల కోసం ఎలాంటి ప్రత్యేక పూజలు ప్రవేశపెట్టినా అనుమతి పొందాలన్నారు. అలా కాకుండా నేరుగా సామాజిక మాధ్యమాలలో ఇష్టారాజ్యంగా ప్రచారాలు చేస్తూ.. భక్తులు, దేవస్థానం కమిటీని పక్కదోవ పట్టిస్తే చర్యలు తప్పవన్నారు. తాము పాలకమండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందే ఆలయంలోని ఇబ్బందులు, భక్తులకు జరుగుతున్న మోసాల గురించి కొంత సమాచారం సేకరించామని జగదీష్‌గౌడు తెలిపారు. భక్తుల విశ్వాసాలు, నమ్మకాలు, ఆలయ పవిత్రతకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సభ్యురాలు నాగశిరోమణి అన్నారు.

భక్తులకు తీర్థం కూడా ఇవ్వరా?

జోగుళాంబ ఆలయంలో జరిగే ఆర్జిత సేవా టికెట్ల పూజలపై పాలక మండలి అసంతృప్తి వ్యక్తంచేసింది. మరోవైపు సాధారణ భక్తులను విస్మరించడాన్ని తప్పు పట్టింది. ఎంతో మంది పేదలు ఆలయానికి వస్తారని.. వారికి కనీసం తీర్థం కూడా ఇవ్వలేనంత బిజీగా ఉన్నారా అని ప్రశ్నించారు. సాధారణ భక్తుల మనసు గాయపరిస్తే సహించమన్నారు. ఇకపై భక్తుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

దాడి ఘటనపై ఆగ్రహం..

పుల్లూరు మధు అనే వ్యక్తి శుక్రవారం రాత్రి ఆలయానికి తప్ప తాగి వచ్చి, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంతో పాటు ఓ ఉద్యోగిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఆలయ పాలక మండలి ఆగ్రహం వ్యక్తంచేసింది. సదరు వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపింది. సమావేశంలో ఆలయ ఈఓ పురేందర్ కుమార్, పాలకమండలి సభ్యులు కుర్వ గోపాల్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, అడ్డాకుల రాము, నాగశిరోమణి, సురేంద్ర స్వామి, జయరాముడు, జగన్మోహన్ నాయుడు, విశ్వనాథరెడ్డి, జగదీశ్వరగౌడు, జి వెంకటేశ్వర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఉన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు..

సంప్రదాయంగా వస్తున్న ఏ ఆచారాలకు పాలక మండలి అడ్డుకాదన్నారు. ఆలయ ఆదాయ, వ్యయాలను తెలుసుకొని అభివృద్ధి దిశగా అడుగులు వేస్తామన్నారు. ఆదాయం, ఖర్చులు తెలియకుండా ఏ కమిటీ ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదని స్పష్టం చేశారు. ప్రసాద్ స్కీం భవనంలో ప్రారంభించే అన్నదాన సత్రంలో వాస్తు హోమాలకు ముహూర్తం నిర్ణయించాలని ఆలయ ప్రధాన అర్చకుడికి సూచించారు. అన్నదాన సత్ర నిర్వహణకు అవసరమైన సామగ్రిని దాతల సహకారంతో సేకరించడం లేదా దేవస్థానం కొనుగోలు చేయాలన్నారు. అనంతరం పుష్కరఘాట్‌పై దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణ స్థలం, అన్నదాన సత్రాన్ని పర్యాటక శాఖ డీఈ పరుషవేది, ఏఈ మధుసూదన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

ప్రాణాలు పణంగా పెట్టి ఫ్యాక్టరీలు కట్టొద్దు


సీఎం రేవంత్‌రెడ్డికి చేసిన ఫ్యాక్స్‌ను చూపుతున్న ఎమ్మెల్యే విజేయుడు

రాజోళి: ప్రజల ప్రాణాలు పెట్టి ఫ్యాక్టరీలు కడితే చూస్తూ ఊరుకోమని అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. మండలంలోని పెద్దధన్వాడ శివారులో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించే ప్రదేశం వద్ద ఆయా గ్రామాల ప్రజలతో కలిసి శనివారం ఆయన ధర్నా నిర్వహించారు. పెద్దధన్వాడలోని ఫ్యాక్టరీ నిర్మాణం ఏర్పాటుపై ప్రజల వ్యతిరేకతను తెలియజేస్తూ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యాక్స్ ద్వారా సమస్యను వివరించామన్నారు. పది గ్రామాలకు పైగా ప్రజలు ఫ్యాక్టరీ వద్దని వ్యతిరేకిస్తుంటే నిర్మాణం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే సమీపంలో ఉన్న తుంగభద్ర నదిలో నీరు కలుషితం కావడంతోపాటు ఏపీలోని కర్నూలు జిల్లాలో పలు గ్రామాలు కూడా కలుషితమవుతాయన్నారు. గాలి కలుషితమై పండే పంటలు కూడా దెబ్బతింటాయని, భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారుతుందని ఆరోపించారు. ఇన్ని ఇబ్బందులు ఉన్నాయని తెలిసినా ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్మాణం ఎలా చేపడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న గ్రామాల్లో ఇలాంటి ప్రమాదకర ఫ్యాక్టరీ నిర్మాణంతో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. నిర్మాణం ఆగకపోతే ప్రజల వెంట నిలిచి పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

కూలీ పనులకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

ట్రాక్టర్ బోల్తా : ఇద్దరు కూలీల దుర్మరణం

- మరో 18 మందికి గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం
- వనపర్తి మండలం సవాయిగూడెంలో ఘటన


బోల్తాపడిన ట్రాక్టర్

వనపర్తి రూరల్: వ్యవసాయ పనులను ముగించుకొని ట్రాక్టర్‌లో ఇంటికి బయల్దేరిన ఇద్దరు కూలీలు మార్గమధ్యంలోనే అనంతలోకాలకు చేరారు. ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 18 మందికి గాయాలైన ఘటన వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సవాయిగూడెం గ్రామానికి చెందిన మేకల శ్రీను తన వేరుశనగ పొలంలో కలుపు తీసేందుకు గాను అదే గ్రామానికి చెందిన 20 మంది కూలీలను భువనచందర్ వ్యక్తి ట్రాక్టర్‌లో వ్యవసాయ పొలానికి తీసుకెళ్లాడు. సాయంత్రం అదే ట్రాక్టర్‌లో కూలీలు ఇంటికి బయల్దేరారు. గ్రామ శివారులోని ముందరి తండా వద్ద ఉన్న చెరువు కట్టను దిగే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో గోపాలమ్మ (50), పద్మమ్మ (45) అనే ఇద్దరు కూలీలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటేశ్వరమ్మ, చరణ్, ట్రాక్టర్ డ్రైవర్ భువన చందర్, సుమిత్రమ్మ, వెంకటేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వెంకటేశ్వరమ్మను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా.. చరణ్, సుమిత్రమ్మలను హైదరాబాద్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. మరో 13 మందికి స్వల్పగాయాలు కావడంతో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు కూలీల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అంతర్ పంటలతో లాభాలు


అంతర్ పంటగా కంది-పత్తి


అంతర్ పంటగా కంది-మొక్కజొన్న

- ఒకే సారి అధిక దిగుబడి
- కలుపు మొక్కలను నివారించొచ్చు

అలంపూర్ : అంతర్ పంటల సాగుతో రైతులకు లాభాలు వస్తాయి. ఒకే రకం పంట వేయడంతో చీడ పీడలు వృద్ధి చెంది దిగుబడులపై ప్రభావం చూపుతుంది. గతేడాది కంటే ఈ ఏడాది అంతర్ పంటల సాగు పెరిగింది. ఈ మేరకు రైతులు అవగాహన పెంచుకుంటే రెండు పంటలు సాగు చేసుకోవచ్చు. అంతర్ పంటల సాగుపై జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి సక్రియనాయక్ రైతులకు సలహాలు, సూచనలను అందిస్తున్నారు.

రెండో పంటతో..

రైతు తన పొలం నుంచి ఒకే సారి ఎక్కువ దిగుబడి పొందవచ్చు. ఒక పంట నష్టపోతే రెండో పంటతో వచ్చే లాభాలతో బయట పడవచ్చు. సహజ వనరులైన నేల, నీరు, సూర్యరశ్మితో పాటు పంటల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. కలుపు మొక్కలు రాకుండా నివారించుకోవచ్చు. నేల కోతను అరికట్టవచ్చు. భూసారాన్ని పెంచుకోనే అవకాశం ఏర్పడుతుంది. (ఉదా : పప్పు జాతి మొక్కలను గడ్డి జాతి ధాన్యపు మొక్కలతో పెంచడం వలన)

ఎలాంటి పంటలు వేసుకోవాలి :

ఒక పంట మరో పంట దిగుబడిని పెంపొందించేలా ఉండాలే తప్పా తగ్గించే విధంగా ఉండకూడదు.

పోషక పదార్థాలు, నీరు, వెలుతురు విషయంలో పంట మధ్య పోటీ ఉండకుండా చూసుకోవాలి. వేర్వేరు ఉన్న పంటలు, పుష్ప జాతి పంటలను కలపడం వలన పోషక పదార్థాల ఆవశ్యకతలో తేడా వలన కీలక దశల్లో పోటీ ఉండకుండా చూసుకోవాలి. ఒక పంట రెండవ పంట పెరగడానికి ఆధారంగా పెంచవచ్చును.

బహుళ వార్షిక పంటలైన ఉద్యానవన పంట మధ్య వరుసల్లో నాలుగైదేళ్ల వరకు అంతర్ పంటలు పండించొచ్చు.

ఒక పంటపై ఆశ్రయించే పురుగుల నిర్మూలనకు మరో పంటపై ఆ పురుగును తినే సహజ శత్రువులను పెంపొందించుటకు కూడా అంతర పంటలు వేయవచ్చు. ఉదాహరణకు.. పత్తి+మినుము+పెసర+కంది

ప్రధాన పంటలను ఆశించే పురుగులను అంతర్ పంటపై ఆకర్షించే చీడపీడల బారి నుంచి ప్రధాన పంటలను రక్షించుకోవచ్చును.

నేల స్థితి : నేల భౌతిక స్థితి/తేలిక/మధ్యస్థ/బరువు నేలలు, నీటి పారుదల వసతి, పోషక పదార్థాలను, నీటి నిల్వ ఉంచుకోనే శక్తి, నేల లోతు, రసాయన స్థితి (చౌడు, ఆమ్ల సమస్యలు) బట్టి ఏ పంటలను ఎన్నుకోవాలో తెలుస్తుంది.

వాతవరణం :

అంతర్ పంటల సాగుపై ప్రభావం చూపేది ప్రధానంగా వర్షపాతం. ఎంత వర్షం కురిసింది, ఏ క్రమంలో కురిసేది కూడా ముఖ్యమైన అంశాలే. వర్షాపాతాన్ని బట్టి కీలక దశల్లో పంటలు నీటి ఎద్దడికి గురికాకుండా పండించుకోవాలి.

చీడ పీడల ఉధృతి : పంట దిగుబడి వచ్చే సమయంలో చీడ పీడల ఉధృతి పెరిగి దిగుబడులు తగ్గిస్తాయి. దీనికి ఒకే రకమైన పురుగులు ఆశిస్తే రెండు పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. చీడపీడల తాకిడి దృష్టిలో ఉంచుకోని అంతర్ పంటలను సాగు చేసుకోవాలి.

భూమి భౌతిక, రసాయన స్థితిని...

సేంద్రియ ఎరువు వీలైనంత ఎక్కువగా వినియోగించి భూమి భౌతిక, రసాయన స్థితిని సంరక్షించుకోవాలి. నిర్ణయించిన మోతాదులో ప్రధాన, అంతర్ పంట విత్తనాన్ని నిర్ధేశించిన నిష్పత్తి వరుసలో నాటాలి. పోషక పదార్థాలు ఎప్పుడు ఎంత మోతాదులో వేయాల్లో తెలుసుకోని ఉండాలి. నీటి వసతి ఉన్నప్పుడు పంటలకు కీలక దశల్లో తప్పక నీరు అందించాలి.

బైక్ ఢీకొని వలస కూలీ మృతి

అమరచింత: బైక్ ఢీకొని చెరుకు కోతలకు వచ్చిన ఓ కార్మికుడు మృతిచెందిన ఘటన మండలంలోని మస్తీపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నుంచి కొందరు కార్మికులు చెరుకు కోతల కోసం కృష్ణవేణి చెక్కర ఫ్యాక్టరీకి వచ్చారు. శనివారం మస్తీపురం శివారులో చెరుకు కోతలు ముగిసిన వెంటనే సాయంత్రం ట్రాక్టర్‌లో నింపి రహదారి పక్కన నిలబడ్డారు. అదే సమయంలో మస్తీపురం గ్రామానికి చెందిన యువకులు బైక్‌పై వేగంగా వచ్చి పెద్ద ఏసుదానం (48)తో పాటు సుశీంద్రబాబును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న యువకులతో పాటు ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యారు. క్షతగాత్రులను వెంటనే ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పెద్ద ఏసుదానం అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సుశీంద్రబాబుకు ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి తరలించారు. తమ గుంపులో ఉన్న ఏసుదాసు మృతి చెందడంతో మిగతా కూలీల రోదనలు మిన్నంటాయి.

కూతురి మరణాన్ని తట్టుకోలేక తల్లి బలవన్మరణం

నవాబుపేట: కన్నకూతురి మరణాన్ని తట్టుకోలేక తల్లి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నవాబుపేట మండలం లోకిరేవు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. లోకిరేవుకు చెందిన ఎరుకలి శివ – శశికళ (27) దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా, పెద్ద కుమార్తె శ్రావంతి (6) రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. ప్రస్తుతం శశికళ ఎనిమిది నెలల గర్భిణి. కూతురు చనిపోయినప్పటి నుంచి తీవ్ర మనోవేదన చెందుతున్న శశికళ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి సరళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

టీడీపీ అసభ్యకర పోస్టులపై డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

- వైఎస్ జగన్, ఇతర నేతలపై అసభ్య పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి
- ఆధారాలనూ సమర్పించిన నేతలు
- రెండు, మూడు రోజులు వేచి చూస్తామని నేతల వెల్లడి.. చర్యలు తీసుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టీకరణ
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అక్రమ కేసులు పెడుతున్నారు: అంబటి
- పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ, చిత్ర హింసలకు గురి చేస్తున్నారు
- సుధారాణిపై సీఐ దాడినీ డీజీపీకి వివరించాం
- దౌర్జన్యకాండపై పోరాటం చేస్తాం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వ్యవస్థీకృత నేర రాజకీయాల్లో
చంద్రబాబు బరితెగింపు
ఎక్స్ వేదికగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి, అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్గనైజ్డ్ క్రైమ్ (వ్యవస్థీకృత నేరాలు)తో కూడిన పాలిటిక్స్ (రాజకీయాలు) సాగిస్తూ చంద్రబాబు మరింతగా బరి తెగించారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. కూటమి 100 రోజుల పాలన, మోసాలు, వైఫల్యాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చంద్రబాబు సృష్టించిన అబద్ధాన్ని ఎల్లో మీడియా మోయడం.. ఆ తర్వాత ఆ పార్టీల నాయకులు, వారిని మోస్తున్న అధికారులు ప్రజల్లో అశాంతిని రేపేలా చర్యలు, కార్యక్రమాలు చేయడం ఒక పన్నాగం ప్రకారం జరిగాయని ఎత్తి చూపారు. 'ఈ నేపథ్యంలో వ్యవస్థీకృత నేరాల కింద అరెస్టు చేయాల్సింది ఎవరిని? జీవిత ఖైదు వేయాల్సింది ఎవరికి? చంద్రబాబుకు కాదా?' అంటూ శనివారం 'ఎక్స్' వేదికగా సోషల్ మీడియాపై ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను ఎండగడుతూ పోస్టు చేశారు. ఆ పోస్టులో జగన్ ఏమన్నారంటే..

1 దొంగే ఎదుటివారిని పట్టుకుని దొంగా అన్నట్టుగా చంద్రబాబు తీరు ఉంది. నలభై ఏళ్లుగా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న చంద్రబాబు ఇప్పుడు కూడా అదే చేస్తూ ఎదుటివారి మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తన స్కాంలు బయటపడుతున్నాయని, తాను చేసిన అవినీతి బయటకు వస్తోందని, తన పాలనా వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతున్నారనే దురహంకారంతో ఒక నియంతలా వ్యవహరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా గొంతు విప్పుతున్నవారిని, ముఖ్యంగా చంద్రబాబు తప్పులను నిలదీస్తున్న యువతను లక్ష్యంగా చేసుకుని చట్టవిరుద్ధంగా, అన్యాయంగా, అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. తన అడుగులకు మడుగులొత్తే పోలీసులను వాడుకుంటూ వారిపై భౌతిక దాడులు చేయిస్తూ, హింసిస్తున్నారు. ఇది ఆర్గనైజ్డ్ క్రైం కాదా?

2 ఎలాగూ చంద్రబాబు చేతిలోనే దాదాపుగా అన్ని పేపర్లు ఉన్నాయి. కాస్తోకూస్తో ప్రజాసమస్యలపై గొంతు విప్పే టీవీలను కూడా వ్యవస్థీకృతంగా దెబ్బ తీశారు. కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి తెచ్చి వాటి ప్రసారాలను ప్రజలకు చేరనీయకుండా పలు మార్లు కట్ చేశారు. ఇక చంద్రబాబుకు కొరుకుడుపడనిది ఒకే ఒక్కటి. అదే సోషల్ మీడియా. అందుకే చంద్రబాబు ఇలా బరితెగిస్తున్నారు. ఇలా ఒక చేత్తో తన మీడియాను, మరో చేత్తో వ్యవస్థలను, ఆ వ్యవస్థల్లోని తన మనుషులను వాడుకుని నాలుగు దశాబ్దాలుగా చంద్రబాబు చేస్తున్న ఆర్గనైజ్డ్ క్రైమ్స్ చూస్తూనే ఉన్నాం. మరి ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌కు పాల్పడుతున్నది ఎవరు?



3 ప్రజలకు మంచిచేసి కాకుండా, మభ్యపెట్టి, మోసం చేసి, అబద్ధాలు ఆడి అధికారంలోకి రావాలని, అధికారంలో ఉంటే దాన్ని ఇలాగే నిలబెట్టుకోవాలన్నది చంద్రబాబు సిద్ధాంతం. దీనికోసం చంద్రబాబుగారు ఒక అబద్ధాన్ని సృష్టిస్తారు. దానికి రెక్కలు తొడిగి తన ఎల్లోమీడియా ద్వారా శరవేగంగా వ్యాపింపచేస్తారు. దానిపైనే వారి పార్టీ నాయకులచేత మాట్లాడిస్తారు. పనిలోపనిగా దత్తపుత్రుడిని, ఇతర పార్టీల్లో తనకు అనుకూలంగా ఉన్నవారినికూడా దీనికి వాడుకుంటారు. ఆ తర్వాత డిబేట్లు చేయిస్తారు. దీనికి మరిన్ని అవాస్తవాలు జోడించి తన కుమారుడు లోకేశ్ ద్వారా సోషల్ మీడియాలో విష ప్రచారం చేయిస్తారు. వాళ్లే ఆరోపణలు చేసి, వాళ్లే మీడియా ట్రయల్ చేసి, వాళ్లే దోషులెవరో నిర్ధారించి, వాళ్లే శిక్షలు విధిస్తారు. ఒక పథకం ప్రకారం, మాఫియా ముఠా మాదిరిగా చంద్రబాబు ఈ నేరాలు చేస్తూనే ఉన్నారు. ప్రత్యర్థి పార్టీలను దెబ్బ తీయడానికి, రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిత్వ హననానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటారు. మరి ఇది వ్యవస్థీకృత నేరం కాదా?

4 అయ్యా చంద్రబాబూ, మీ పార్టీ టీడీపీ అధికారిక సోషల్ మీడియా అకౌంట్లో మీరే ఫేక్ న్యూస్‌పెట్టి, దాన్ని మీరే ప్రాపగండా చేసిన లేటెస్ట్ ట్వీట్‌ను రాష్ట్ర ప్రజలంతా గమనించారు. ఎప్పుడో రెండేళ్ల కిందట మా అమ్మ కారు టైర్ బరస్ట్ అయితే, అప్పటి వీడియోను ఇప్పుడు బయటకు తీసి, లేటెస్ట్‌గా ఇప్పుడే జరిగినట్టుగా, మీరు ట్వీట్‌లో పెడుతూ, నా తల్లిని నేను చంపాలని అనుకున్నానని సిగ్గుమాలిన రీతిలో వ్యక్తిత్వ హననానికి నువ్వు దిగావు. దీన్ని ఖండిస్తూ మా అమ్మ లేఖ రాస్తే దాన్నికూడా ఫేక్ లెటర్‌గా పేర్కొంటూ నువ్వు పబ్లిసైజ్ (ప్రచారం) చేయడం సిగ్గుమాలిన చర్య కాదా? మళ్లీ మా అమ్మ వీడియో మెసేజ్ కూడా ఇస్తూ మీ తీరును దుయ్యబట్టింది. ఇంతలా ఉద్దేశ పూర్వకంగా వ్యక్తిత్వ హననం చేసిన నిన్ను, నీ కొడుకును ఇదే పోలీసులు ఎందుకు అరెస్టు చేయడం లేదు? ఇలాంటివి శతకోటి మీ ఏబీఎన్, మీ ఈనాడు, మీ టీవీ-5, మీ అనుకూల మీడియా ఎన్ని చేసినా పోలీసులు ఏనాడైనా చర్యలు తీసుకున్నారా? నువ్వు చేస్తే ఏదైనా మంచే! కాని నువ్వు చేసిన తప్పుడు పనులను, ప్రజా వ్యతిరేక చర్యలను ఎవరైనా ప్రశ్నిస్తే అది చెడు అవుతుందా? వారిపై కేసులు పెట్టి వారిని హింసించడం ధర్మమేనా?

5 కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్గనైజ్డ్ క్రైమ్‌తోకూడిన పాలిటిక్స్‌లో చంద్రబాబు మరింతగా బరితెగించారు. మొన్నటి తిరుమల లడ్డూ వ్యవహారం వరకూ జరిగిన అనేక పరిణామాలు దీనికి ఉదాహరణ. కూటమి 100 రోజుల పాలన, మోసాలు, వైఫల్యాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చంద్రబాబు సృష్టించిన అబద్ధాన్ని ఎల్లోమీడియా మోయడం, ఆ తర్వాత ఆ పార్టీల నాయకులు, వారిని మోస్తున్న అధికారులు ప్రజల్లో అశాంతిని రేపేలా చర్యలు, కార్యక్రమాలు చేయడం ఒక పన్నాగం ప్రకారం జరిగాయి. మరి వ్యవస్థీకృత నేరాల కింద అరెస్టు చేయాల్సింది ఎవరిని? జీవిత ఖైదు వేయాల్సింది ఎవరికి? చంద్రబాబుకు కాదా?

అరాచకానికి పరాకాష్ట



ఏపీలో అక్రమ కేసులు.. నిర్బంధాలు.. చిత్రహింసలు వికృత క్రీడ.. ● చంద్రబాబు ప్రభుత్వ రాక్షసానందం

- ఇష్టానుసారం కక్ష సాధింపులతో పౌర హక్కుల హననం
- పాలకులను ప్రశ్నిస్తే దండన తప్పదని సరికొత్త ఆదేశం
- జీ హుజూర్ అంటూ పోలీసు శాఖ అత్యుత్సాహం
- సుప్రీంకోర్టు, హైకోర్టు హెచ్చరికలు సైతం బేఖాతర్.. ఇప్పటికే వందలాది మందిపై తప్పుడు కేసులు

సాక్షి, అమరావతి : ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వారిపైకి పోలీసులను ఉసిగొలుపుతోంది. రాజ్యాంగ ధర్మాన్ని మంటగలుపుతూ పౌర హక్కులను కాలరాస్తోంది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు చట్టం, రాజ్యాంగం అనే వాటికి తిలోదకాలు వదిలారు. అధికార పార్టీల నేతలు చెప్పిన వారందరిపై ఉన్నవీ లేనివీ కల్పించి ఎక్కడికక్కడ తప్పుడు కేసులు పెడుతున్నారు. ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులతో విరుచుకుపడుతున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని 24 గంటల్లో న్యాయస్థానంలో హాజరు పరచాలన్న చట్టాన్ని నిర్భీతిగా ఉల్లంఘిస్తున్నారు. మహిళలు, వృద్ధులు, మైనర్లు అని కూడా చూడకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ చిత్రహింసలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు అర్ధరాత్రి, అపరాత్రి అని కూడా చూడకుండా ఊళ్లపై పడి బీభత్సం సృష్టిస్తున్నారు. నిద్రిస్తున్న వారిని అపహరించుకుపోతున్నారు. ఎక్కడికి తీసుకువెళుతున్నారో చెప్పరు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి అడిగితే మాకేం తెలీదనే సమాధానం వస్తుంది. పోలీసు వాహనాల్లో కుక్కి.. కొడుతూ ఎక్కడెక్కడో తిప్పుతున్నారు. గుర్తు తెలియని ప్రదేశాల్లో నిర్బంధించి చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఎందుకు కొడుతున్నారని అడిగితే లాఠీలే సమాధానమిస్తున్నాయి. మేం చేసిన తప్పేమిటని ప్రశ్నిస్తే పోలీసుల బూట్లే మాట్లాడుతున్నాయి. ఒక్కొక్కరిపై రెండు మూడు అక్రమ కేసులు నమోదు చేస్తూ ఒక పోలీస్ స్టేషన్ నుంచి మరో పోలీస్ స్టేషన్‌కు తిప్పుతున్నారు. మూడు నాలుగు రోజుల్లోనే ఏకంగా 110కి పైగా అక్రమ కేసులు నమోదు చేయడం ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనం. ఇవన్నీ బాధితుల తరపున లాయర్లు, గ్రామ పెద్దలు నిలదీస్తేనే అధికారికంగా ప్రకటించినవి కావడం గమనార్హం. అరెస్టు చూపకుండా వేధిస్తున్న కేసులు వేలల్లో ఉన్నాయనడం అక్షర సత్యం. ఒక్కో కేసులో ఒకరు మొదలు 10–20 మందిని సైతం నిందితులుగా చేరుస్తూ వేధిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా అరెస్ట్ చేయకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును సైతం బేఖాతరు చేస్తున్నారు. 41 ఏ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలన్న ఆదేశాలు పట్టవన్నట్టు చెలరేగిపోతున్నారు. బాధిత కుటుంబాలు హెబియస్ కార్పస్ పిటీషన్లతో హైకోర్టును ఆశ్రయించినా తమ నియంతృత్వాన్ని నిర్భీతిగా సమర్థించుకోవడం దుర్మార్గం. ఇదీ చంద్రబాబు మార్కు పోలీసు రాజ్యం.

మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగం!

సోషల్ మీడియా యాక్టివిస్ట్ పెద్దిరెడ్డి సుధారాణి పట్ల పోలీసులు మహిళ అని కూడా చూడకుండా అత్యంత క్రూరంగా వ్యవహరించడం దారుణం. మూడు రోజుల పాటు ఆమెను, ఆమె భర్తను చిత్రహింసలకు గురిచేశారు. 'నన్ను ఈ నెల 5వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. నా భర్త వెంకట రెడ్డినీ చిత్రహింసలకు గురిచేశారు. చిలకలూరిపేట సీఐ రమేష్ దుర్భాషలాడారు. నోరెత్తితే ఇష్టానుసారం కొట్టారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల వద్ద జొన్నవాడలోని రాజరాజేశ్వరి ఆలయానికి వెళ్లినప్పుడు మమ్మల్ని పల్నాడు జిల్లా చిలకలూరిపేట సీఐ రమేష్ బృందం అదుపులోకి తీసుకుంది. చిలకలూరిపేట, ఒంగోలుకు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు' అని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు. తుదకు ఆమె తరపు వారు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడంతో శుక్రవారం సాయంత్రం కొత్త పేట పోలీసులు గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టారు. ఇదే విషయాన్ని ఆమె మెజిస్ట్రేట్ ఎదుటే చెప్పారు. పోలీసులు కొట్టడంతో అయిన గాయాలను చూపించారు. ఈమెపై 6 అక్రమ కేసులు బనాయించారు.

శాంతిభద్రతలు నిల్.. వేధింపులు ఫుల్!

వరుస హత్యలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలతో ఏపీ అట్టుడుకుతోంది. వీటిని అరికట్టాల్సిన చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. టీడీపీ గూండాలు కర్రలు, కత్తులతో గ్రామాలపై పడి బీభత్సం సృష్టిస్తున్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో 177 మంది హత్యకు గురయ్యారు. 500కుపైగా హత్యాయత్నాలు జరిగాయి. 2 వేలకుపైగా దాడులతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారింది. టీడీపీ గూండాల దాడులతో భీతిల్లి దాదాపు 3 వేల కుటుంబాలు గ్రామాలు విడిచిపెట్టి ఇతర ప్రాంతాల్లో తల దాచుకుంటున్నాయి. అత్యాచార పర్వానికి అంతు లేకుండా పోయింది. నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో 110 మందిపై అత్యాచారాలు, లైంగిక దాడులు జరిగాయి. అయినా శాంతిభద్రతలతో తమకు సంబంధం లేదన్నట్లు సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఓ ముస్లిం బాలిక కిడ్నాప్‌కు గురికాగానే ప్రభుత్వం స్పందించి ఉంటే ఇప్పుడు ఆ అమ్మాయి బతికుండేది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు జాన్ 16 ఏళ్ల బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడితే ఏ మేరకు శిక్ష వేశారో పాలకులే చెప్పాలి.

ఇది నేరమట!



శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో ఈనెల 1వ తేదీన భైనపల్లి దానమ్మ అనే వృద్ధురాలు పింఛన్ కోసం గంటలతరబడి వేచి ఉంటూ సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికులు వెంటనే ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఇదే విషయాన్ని అదే మండలం కొండపల్లి గ్రామ ఉప సర్పంచ్ మద్దు జస్వంత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇతని పాలిట ఇదే పాపమైపోయింది. పాలక పార్టీ పెద్దల ఆదేశాలతో పోలీసులు అక్రమంగా కేసు పెట్టారు. అంతటితో ఆగకుండా ఆయన్ను భయపెట్టాలని కూడా ఆదేశించారు. దీంతో పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. అప్పుడు ఆయన ఇంట్లో లేడు. గంటల కొద్దీ అక్కడే ఉండి ఆయన కుటుంబ సభ్యులను మానసికంగా వేధించారు. ఆ తర్వాత ఎటువంటి నోటీస్ ఇవ్వకుండానే జస్వంత్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ రోజు కార్తీక పూజ నిర్వహిస్తున్నామని, భోజనం చేసి వస్తానన్నా కూడా వదల్లేదు. ఫోన్‌ను కూడా లాగేసుకున్నారు. ఏం కేసు పెట్టారని అడిగినా అప్పుడు చెప్పలేదు. తర్వాత లాయర్ సాయంతో బయటకు వచ్చాడు. అయినా ఇప్పటికీ ఫోన్ చేస్తూ ఎప్పుడుపడితే అప్పుడు స్టేషన్‌కు రావాలంటూ ఫోన్లు చేసి పిలిపిస్తూ మానసికంగా వేధిస్తున్నారు. 192 బీఎన్ఎస్ సెక్షన్‌తో ఎఫ్ఐఆర్ (150/24) నమోదు చేశారు.





జశ్వంత్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు (ఇన్‌సెట్‌లో) మద్దు జశ్వంత్

సత్తా చాటిన బాలికలు

- అండర్–19 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ఫైనల్‌కు పాలమూరు
- వరుస విజయాలతో అమ్మాయిల జట్టు దూకుడు
- బాలుర ఫైనల్‌లో రంగారెడ్డి, హైదరాబాద్



మహబూబ్‌నగర్-ఖమ్మం జట్ల సెమీఫైనల్ మ్యాచ్ దృశ్యం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో ఆతిథ్య పాలమూరు బాలికలు సత్తా చాటారు. టోర్నీలో లీగ్ కమ్ నాకౌట్‌లో వరుసగా మూడు విజయాలు సాధించిన జిల్లా అమ్మాయిలు ఫైనల్‌కు చేరారు. శనివారం మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన బాలికల విభాగం మ్యాచ్‌లో జిల్లా బాలికల జట్టు 20–8 గోల్స్ తేడాతో వరంగల్ జట్టుపై, 15–4 తేడాతో నల్లగొండ జట్టుపై విజయాలు నమోదు చేసుకుంది. ఉత్కంఠంగా జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ బాలికల జట్టు 28–26 తేడాతో ఖమ్మం జట్టుపై గెలుపొంది ఫైనల్‌కు చేరింది. బాలికల విభాగం మరో సెమీస్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 34–10 తేడాతో రంగారెడ్డి జట్టుపై విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించింది. హైదరాబాద్–మహబూబ్‌నగర్ జట్ల మధ్య ఆదివారం తుదిసమరం జరగనుంది.

■ బాలుర విభాగంలో హైదరాబాద్, రంగారెడ్డి జట్లు ఫైనల్‌కు చేరాయి. సెమీ ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 26–20 గోల్స్ తేడాతో కరీంనగర్‌పై, మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 33–11 తేడాతో వరంగల్ జట్టుపై గెలుపొందింది. ఇక లీగ్ మ్యాచ్‌ల విషయానికి వస్తే.. కరీంనగర్ జట్టు 26–2 గోల్స్ తేడాతో నల్లగొండ జట్టుపై, హైదరాబాద్ జట్టు 28–6 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై, రంగారెడ్డి జట్టు 27–0 తేడాతో నల్లగొండ జట్టుపై, మెదక్ జట్టు 11–4 తేడాతో ఆదిలాబాద్‌పై, వరంగల్ జట్టు 25–13 తేడాతో ఖమ్మం జట్టుపై, కరీంనగర్ జట్టు 23–8 తేడాతో ఆదిలాబాద్ జట్టుపై, రంగారెడ్డి జట్టు 27–10 తేడాతో మెదక్ జట్లపై గెలుపొందాయి.

గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించాలి

క్రీడల్లో గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటాలని అండర్–19 విభాగం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి అన్నారు. శనివారం లీగ్ మ్యాచ్‌ల సందర్భంగా ఆయన ఆయా క్రీడాజట్లను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాటోర్నీలతో క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీయవచ్చని అన్నారు. ఓటమితో బాధపడకుండా మళ్లీ విజయం కోసం శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో టోర్నమెంట్ రాష్ట్ర పరిశీలకుడు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు ఖాలెద్‌అలీ, సుబాన్‌జీ, పీడీ ముక్రం, డీఎస్ఏ బాస్కెట్‌బాల్ కోచ్ ఎండీ.ఖలీల్ పాల్గొన్నారు.



ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న పాపిరెడ్డి తదితరులు



ఫైనల్‌కు చేరిన పాలమూరు బాలికల జట్టు





హ్యాండ్‌బాల్ టోర్నీలో పాలమూరు రన్నరప్

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో శనివారం ముగిసిన రాష్ట్రస్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలబాలికల జట్లు రన్నరప్ సాధించాయి. ఈ సందర్భంగా అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. – మహబూబ్‌నగర్ క్రీడలు

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

జడ్చర్ల టౌన్: పట్టణంలోని స్టేడియంలో శనివారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 ఫుట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 52 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు నాలుగు రోజులపాటు ఇక్కడే ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి తెలిపారు. క్రీడాకారులను ప్లేవాక్ అసోసియేషన్ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పీడీ మోయిన్ పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపికకు హాజరైన క్రీడాకారులు

జూరాలలో విద్యుదుత్పత్తి నిలిపివేత



జెన్‌కో జల విద్యుత్ కేంద్రం

ధరూరు: ప్రియదర్శిని జూరాలలో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. ఒక యూనిట్‌లో కొనసాగుతున్న విద్యుదుత్పత్తిని నీటి కొరత కారణంగా నిలిపివేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కాగా, శుక్రవారం ప్రాజెక్టుకు 8,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం సాయంత్రం వరకు 5వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీటి పంపింగ్ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. కోయిల్‌సాగర్‌కు 315, ఆవిరి రూపంలో 72, ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 730, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,447 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో 877.5 అడుగుల నీటినిల్వ..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో 877.5 అడుగుల వద్ద 175.9226 టీఎంసీల నీటినిల్వ ఉంది. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 10,417, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,561, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 7.498 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 11.806 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

రామన్‌పాడుకు 1,552 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి 1,552 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 1,020 అడుగుల నీటిమట్టం ఉంది. ఎన్టీఆర్ కాల్వకు 911, కుడి, ఎడమ కాల్వలకు 25, వివిధ లిఫ్టులకు 851, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

సుంకేసులలో ఒక గేటు ద్వారా..

రాజోళి: సుంకేసుల డ్యాంకు 4,720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఒక గేటు ద్వారా 2,264 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌నంటూ ఆన్‌లైన్ మోసం

కోస్గి: సైబర్ నేరాలను అరికట్టేందుకు అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. పట్టణ శివారులోని ఇసుక బావి సమీపంలో ఉన్న ఓ హోటల్ యజమానికి అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి నేను మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నా.. నీ హోటల్‌కు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటూ హుకూం జారీ చేశాడు. ఆ వ్యక్తి మాటలు నమ్మిన సదరు యజమాని గుర్తుతెలియని వ్యక్తి చెప్పినట్లుగా రూ.2 వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. సాయంత్రం సదరు వ్యక్తికి ఫోన్ చేయగా అందుబాటులో లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీశాడు. అధికారులు ఆన్‌లైన్‌లో వివరాలు పరిశీలించి, నగదు గుర్తు తెలియని వ్యక్తికి చెల్లించినట్లు నిర్ధారించారు. మోసపోయినట్లు గుర్తించిన సదరు హోటల్ యజమాని చేసేది లేక వెనుదిరిగాడు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ ఎవరైన వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటే సమీపంలోని ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా సీడీఎంఏ వెబ్‌సైట్‌లో చెల్లించాలని, లేకపోతే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి

గోపాల్‌పేట: ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన రేవల్లి మండలం బండరావిపాకుల శివారులో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. రేవల్లి ఎస్ఐ రాము కథనం మేరకు.. మండలంలోని నాగపూర్‌కు చెందిన దొడ్డి వెంకటేశ్ (32)కు బండరావిపాకుల శివారులో వ్యవసాయ పొలం ఉంది. శనివారం మధ్యాహ్నం పొలానికి వెళ్లి పనులు ముగించుకొని తన సొంత ట్రాక్టర్‌పై ఇంటికి బయలుదేరాడు. బీటీ రోడ్డు సమీపానికి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్ ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయాడు. ఇంజిన్‌కు మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు గమనించి ట్రాక్టరును పక్కకు జరిపి బయటకు తీసేలోగా కాళ్లు కాలి అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. వెంకటేశ్‌కు భార్య పావని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

రెండు ఇళ్లల్లో చోరీ

తిమ్మాజిపేట: మండలంలోని చేగుంటలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఏఎస్ఐ ప్రిసిల్లా వివరాల మేరకు.. చేగుంటకు చెందిన అనమోని బచ్చమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం తమ బంధువు వివాహ వేడుకకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు అర్ధరాత్రి తలుపులను పగులగొట్టి ఇంట్లోని పెట్టెలో ఉన్న రూ. 30వేల నగదు, తులం బంగారం, 13 తులాల వెండి ఆభరణాలను చోరీ చేశారు. అదే గ్రామానికి చెందిన గంటెల శివ ఇంట్లోనూ రూ. 17వేల నగదు, 14 తులాల వెండి గొలుసులను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుల ఇళ్లల్లో క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.